

మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట ప్రజలు అండగా నిలవాలి

● కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గం తనకు సొంత గడ్డ అని, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు మరోసారి తనకు భారీ మెజారిటీ అందించాలని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి కోరారు. ఆదివారం బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు పార్కులో కాలనీవాసులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్. ఎన్. గౌతమ్‌రావు, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు కృష్ణకుమార్, క్షీరసాగర్, బల్వీర్, మల్లికార్జున్, విజయ్‌మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీధర్‌గౌడ్, అనిల్, సుధాకర్ తదితరులు

దానం నాగేందర్‌పై గౌతంరావు వ్యాఖ్యలు అర్ధరహితం

అంబర్‌పేట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌పై బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు చేసిన వాఖ్యలు అర్ధరహితమని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. ఆదివారం అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గడ్డం శ్రీధర్‌గౌడ్, కోటం అనిల్‌కుమార్, రావుల సుధాకర్ తదితరులు విలేకరులతో మాట్లాడారు. దానం నాగేందర్ నగర అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. సూర్యాపేటకు చెందిన గౌతమ్‌రావు, ఇబ్రహీంపట్నంకు చెందిన కిషన్‌రెడ్డికి నగరం గురించి అవగాహన లేదన్నారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతో బీజేపీ నేతలు దానం నాగేందర్‌పై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. గౌతమ్‌రావు మరోసారి దానం నాగేందర్‌పై విమర్శలు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. సికింద్రాబాద్ అభివృద్ధికి ఎంపీగా, కేంద్రమంత్రిగా కిషన్‌రెడ్డి ఏమి చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

'దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి'

ముషీరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని గాంధీ ఆస్పత్రి రిటైర్డ్ డెంటల్ సర్జన్ డాక్టర్ ఓ. నాగేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం భోలక్‌పూర్ ప్రభుత్వ బాలికల వసతి గృహంలో డాక్టర్ రావూస్ ఓరల్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని 80 మంది చిన్నారులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. డాక్టర్ ఓ. నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. దంత సమస్యను నిర్లక్ష్యం చేస్తే క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో దంత వైద్యులు దేవరాజ్, అశోక్, కుసుమా భోగరాజు, హాస్టల్ వార్డెన్ భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు

బర్కత్‌పుర, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ జీవీఆర్ కరాటే అకాడమీలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మి రామన్‌గౌడ్ ప్రారంభించారు. శిబిరానికి హాజరైన 200 మందిని వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరాటే అకాడమీ డైరెక్టర్ జీఎస్. గోపాల్‌రెడ్డి, దంత వైద్యులు వైద్యులు అమిత్‌జి జిలాని, శ్రావణి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా తలంబ్రాల మేళన

చిక్కడపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయం పునర్‌నిర్మాణానంతరం ద్వితీయ వార్షికోత్సవాల సందర్భంగా ఆదివారం ఆలయంలో తలంబ్రాల మేళన కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సమదర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.ఈనెల 17న ఆలయంలో జరిగే శ్రీ సీతారామ కల్యాణం సందర్భంగా ఆలయం ఎదుట చలువపందిళ్లు ఏర్పాటు చేశారు.



పురస్కారగ్రహీతలతో అతిథులు

పురస్కారాలు ఆక్సిజన్‌లా పనిచేస్తాయి

చిక్కడపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రతిభను గుర్తించి ఇచ్చే పురస్కారాలు గ్రహీతలకు ఆక్సిజన్‌లా పనిచేస్తాయని కేంద్ర మాజీ మంత్రి ఎస్. వేణుగోపాలచారి అన్నారు. యువ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రముఖులకు ఉగాది జాతీయ పురస్కారాల ప్రదానసభ త్యాగరాయగానసభలో జరిగింది. మాజీ మంత్రి పుష్పలీల, కళాపోషకుడు చిల్ల రాజశేఖరరెడ్డి, వేముల కేశవనాథ్, శైలజాసుధాకర్, వసంతరాయలు, విప్లవ గాయని అరుణోదయ విమలక్క, నిర్వాహకుడు వెంకటరమణ పాల్గొన్నారు.

గానసభలో శ్రీమద్రామాయణసుధ ప్రసంగాలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): సాహితీ జిగీష సాహితీ సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీమద్రామాయణ సుధపేరుతో ప్రసంగాల కార్యక్రమం ఏర్పాటుచేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉస్మానియా యూనివర్సిటీ తెలుగుశాఖ విశ్రాంతాచార్యులు వెలుదండ నిత్యానందరావు రంగనాథరామాయణంలోని అవాల్మీకాలు, విశేషాలను వివరించారు. విశ్వసాహితీ అధ్యక్షుడు డా.జయరాములు రామాయణ కథా విశేషాలను వివరించారు. ఆచార్య ఫణీంద్ర భాస్కరరామాయణం గురించి తెలిపారు. డా. లలితవాణి మొల్ల రామాయణాన్ని విశ్లేషించారు. సభకుముందు శ్రీరాముడు అంశంతో కవి సమ్మేళనం ప్రముఖ కవి చిక్కా రామదాసు అధ్యక్షతన జరిగింది. అనంతరం కవులను సత్కరించారు.



అభయాంజనేయస్వామి దేవస్థాన కమిటీ సభ్యులు

అభయాంజనేయస్వామి దేవస్థానం కార్యవర్గం

రాంనగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాంనగర్ అభయాంజనేయస్వామి దేవస్థానం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా బొట్టు శ్రీనివాస్, వైస్ చైర్మన్‌లుగా విజయ్‌యాదవ్, పవన్, ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్, కోశాధికారిగా ఎం. రవికుమార్, సంయుక్త కార్యదర్శులుగా పి. రాహుల్, సురేష్, వినయ్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా విజయ్, బాబు, సలహాదారులుగా నర్సింహ, రాజేష్, నవీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

శ్రీరాముడి ప్రతిమ, కాషాయ జెండాల పంపిణీ

రాంనగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని ఈ నెల 17న చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి సంజయ్‌నగర్‌లోని శ్రీహనుమాన్ దేవాలయం వరకు శ్రీరాముడి శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పార్థసారధి తెలిపారు. ఆదివారం చిక్కడపల్లిలోని పలు ప్రాంతాలలో ఇంటింటికి శ్రీరాముడి ప్రతిమ, కాషాయ జెండాలను పంపిణీ చేశారు. గడ్డం సతీష్, జైపాల్‌రెడ్డి, కలకోట అరుణ్, జ్యోతి, హర్ష, సూరి, కేశవ్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



భోలక్‌పూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్



గోల్నాకలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



గోల్నాక కృష్ణానగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు



రాంనగర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్ తదితరులు

అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి

అంబేడ్కర్

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, రాజకీయనాయకులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని అన్నారు.

- ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం (ఆంధ్రజ్యోతి)



కవాడిగూడ పూల్‌బాగ్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ జి. రచనశ్రీ తదితరులు



గోల్నాక కృష్ణానగర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్



బాగ్‌లింగంపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రాంనగర్ కార్పొరేటర్ కె. రవిచారి



వాల్మీకినగర్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకుడు పూసరాజు, కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్



కాచిగూడ లింగంపల్లి చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తదితరులు



ముషీరాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు



లోయర్‌ట్యాంక్‌బండ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి



నల్లకుంట రత్నానగర్‌లో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య తదితరులు



అంబర్‌పేటలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతమ్ రావు, మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్ తదితరులు



ఆజామాబాద్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్ తదితరులు



వీఎస్టీ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న యూనియన్ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



ట్యాంక్‌బండ్‌పై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బి.బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు

జార్జిరెడ్డి స్ఫూర్తితో విద్యార్థులు పోరాడాలి

● ప్రొఫెసర్ హరగోపాల్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

రాంనగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కుల, మత, జాత్యహంకారానికి వ్యతిరేకంగా జార్జిరెడ్డి స్ఫూర్తితో విద్యార్థులు పోరాడాలని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. సమాజంలో జరుగుతున్న దోపిడీ, దౌర్జన్యాలు, అన్యాయాలను అరికట్టాలనే బాధ్యత విద్యార్థులు తీసుకోవాలన్నారు. ఆదివారం విద్యానగర్ మార్క్స్ భవన్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జార్జిరెడ్డి 52వ వర్ధంతి సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పాలకులు సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారనే భ్రమలు వీడి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. లక్షలాది మంది యువత ఉపాధి కోసం ఏళ్లతరబడి ఎదురుచూస్తోందని వాపోయారు. ఉద్యోగాలు ఇవ్వడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. జార్జిరెడ్డి స్ఫూర్తితో మతోన్మాద భావజాలాన్ని పారద్రోలాలన్నారు. ప్రొఫెసర్ కొండా నాగేశ్వరరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఆవుల అశోక్, రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ, ఓయూ కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి ఆచార్యులు కూడా మాట్లాడారు. కార్యక్రమంలో పృథ్వి అనిల్, సాయికుమార్, సురేష్, సుమంత్, రాకేష్ పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి



మాట్లాడుతున్న మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఓబైదుల్లా కొత్వాల్

బర్కత్‌పుర, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత నేటి పౌరులపై ఉందని పలువురు వక్తలు అన్నారు. దేశాన్ని హిందూ దేశంగా మార్చేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలను ఓటు ద్వారా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను జైలులో పెట్టడం అప్రజాస్వామికం అని వారన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షతన సేవ్ సెక్యూలరిజం, సేవ్ ఇండియా అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. సదస్సులో రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఓబైదుల్లా కొత్వాల్, ఆర్థిక రంగ విశ్లేషకులు డి. పాపారావు, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దెల. రమేష్ పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలు ఫాసిస్టు మోదీ ప్రభుత్వానికి, ప్రజాస్వామ్య విలువలకు మధ్య జరుగుతోందని, ప్రజలు వాస్తవాలను తెలుసుకుని మోదీని ఓడించి దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం దేశంలో లౌకిక వ్యవస్థ, పౌర హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. అవినీతికి వ్యతిరేకంగా ప్రజలను జాగృతం చేస్తున్న సీఎం కేజ్రీవాల్‌ను బీజేపీ ప్రభుత్వం జైలుకు పంపడం ప్రజా ఉద్యమాలను అణచివేయడమేనని ఆరోపించారు. కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్రా రాములుగౌడ్, డాక్టర్ అన్సారీ, ఎంఏ మాజిద్, మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు హేమ, యమునగౌడ్, అధికార ప్రతినిధులు ఫణిభూషణ్, జావేద్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో అంకో ఇమేజింగ్‌పై సీఎంఈ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నిమ్స్ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు మూడోవ వర్ధంతి సందర్భంగా ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకో ఇమేజింగ్‌పై సీఎంఈ నిర్వహించారు. కార్యక్రమంలో పలు రకాల క్యాన్సర్లపై వైద్యులు మాట్లాడారు. క్యాన్సర్‌లో చోటు చేసుకున్న కొత్త చికిత్సలు, రోగ నిర్ధారణ పరీక్షలపై చర్చించారు. క్యాన్సర్ నిపుణులు, రేడియాలజిస్టులు, న్యూక్లియర్ మెడిసిన్ ఫిజిషయన్లు పాల్గొని తమ అనుభవాలను వివరించారు. డాక్టర్ సెంథిల్ రాజప్ప ప్రొస్టేట్ క్యాన్సర్‌పై ప్రసంగించారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. బీరప్ప, కాకర్ల సుబ్బారావు కుటుంబ సభ్యులను సత్కరించారు.



నిమ్స్ వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సీఎంఈలో పాల్గొన్న వైద్యులు

నర్తకికి ఉగాది పురస్కారం



త్యాగరాయగానసభలో మహతి ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో జరిగిన ఉగాదిపురస్కారాల ప్రదాన సభలో భాగంగా నాట్యగురువు పసుమర్తి శేషుబాబు నుంచి పురస్కారం అందుకుంటున్న వర్ధమాన నర్తకి డి. మీనాక్షి

- చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి

సుందరకాండ పారాయణం



అశోక బిర్లా, సంతోష్ జవర్ కుటుంబాల ఆధ్వర్యంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆదివారం నల్లకుంటలో సుందరకాండ పారాయణ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి సతీమణి కావ్యాకిషన్‌రెడ్డి, కార్పొరేటర్ వై. అమృత, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.మధుసూదన్‌యాదవ్, ప్రేమ, శ్రీనివాస్, పాండు తదితరులు పాల్గొన్నారు

- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

'మేనిఫెస్టోలో బీసీ రిజర్వేషన్లను విస్మరించిన బీజేపీ'

రాంనగర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రకటించిన మేనిఫెస్టోలో బీసీ రిజర్వేషన్లు, సంక్షేమం, అభివృద్ధి పథకాల ప్రస్తావన లేకపోవడం విచారకరమని ఎంపీ ఆర్. కృష్ణయ్య అన్నారు. ఆదివారం విద్యానగర్‌లో బీసీ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీలకు రాజ్యాంగపరంగా రావాల్సిన నిధులు, ఉద్యోగాలు, కుల గణన అంశాలను ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించకపోవడం బీసీలను మోసం చేయడమేనన్నారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వలేదన్నారు. బీజేపీ ముందు నుంచి బీసీ వ్యతిరేక చర్యలను అలంబిస్తోందని, ఇది మేనిఫెస్టో ద్వారా బహిర్గతమైందన్నారు. ప్రధానమంత్రిగా బీసీ నాయకుడు ఉండి కూడా బీసీల సమస్యలను పరిష్కరిస్తామని మేనిఫెస్టోలో పేర్కొనలేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీసీలు బీజేపీ గుణపాఠం చెబుతారని కృష్ణయ్య హెచ్చరించారు.

పద్మశాలి కాలనీలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

ముషీరాబాద్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజపేట చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం భోలక్‌పూర్ డివిజన్ పద్మశాలి కాలనీలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. అనంతరం ట్రస్ట్ అధ్యక్షుడు ఆర్. అంజనేయులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాజపేట చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి సుజాత, ప్రతినిధులు గోవింద్ రాజ్, సుందర్‌పటాలే, తీరుపల్లి హేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం

బీజేపీ మైనారిటీ మోర్చా ఇన్‌చార్జిగా ఐజాక్‌రాజ్



నల్లకుంట, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ మైనారిటీ మోర్చా ఇన్‌చార్జిగా నల్లకుంటకు చెందిన మైనారిటీ మోర్చా రాష్ట్ర మీడియా కన్వీనర్ ఎం.ఐజాక్‌రాజ్ నియమితులయ్యారు. మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అఫ్సర్ పాషా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఐజాక్‌రాజ్ మాట్లాడుతూ.. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు విజయానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

3,800 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

జీడిమెట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్‌వోటీ, జీడిమెట్ల పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 3,800 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. సుభాష్‌నగర్‌కు చెందిన సంగిశెట్టి వెంకటేశ్వర్లు కొంతకాలంగా రేషన్ బియ్యం సేకరించి అధిక ధరకు విక్రయిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఆదివారం అతడిని అదుపులోకి తీసుకుని బియ్యం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ. 95 వేలు ఉంటుందని తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలో మరిచిపోయిన నగలు బాధితుడికి అందజేత



బాధితుడికి నగలు అందజేస్తున్న పోలీసు

జీడిమెట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఆటోలో మరిచిపోయిన నగలను బాధితుడికి అందజేశారు పోలీసులు. అనారోగ్యంతో ఉన్న కుమార్తె చికిత్స కోసం చందర్ అనే వ్యక్తి గండిమైసమ్మ నుంచి షాపూర్‌నగర్ ఈనెల 13వ తేదీన ఆటోలో వచ్చాడు. ఆటోలో నగల బ్యాగు మర్చిపోయిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసీ సీసీ ఫుటేజీల ఆధారంగా ఆటోను గుర్తించి నగల బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. బ్యాగులో ఉన్న రెండున్నర తులాల బంగారు ఆభరణాలను బాధితుడికి అందజేశారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

మియాపూర్, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్ ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. మాతృశ్రీనగర్‌లో ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాడిచేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 1.96 లక్షలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆర్గనైజ్ చేసిన రాజ్‌కుమార్‌తో పాటు మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

జీడిమెట్ల, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని మృతదేహాన్ని జీడిమెట్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 35 ఏళ్ల వయస్సుగల వ్యక్తి ఐడీపీఎల్ కాలనీ నుంచి జగద్గిరిగుట్ట వెళ్లే దారిలోగల వివేకానంద విగ్రహం వద్ద మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలియరాలేదు.